

ప్రజాశక్తి

ఆదివారం 16 ఫిబ్రవరి 2025 | 5 | విజయనగరం






భోగాపురం మండలంలోని సన్‌రే రిసార్ట్‌లో శనివారం జరిగిన ఓ వివాహ వేడుకకు శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, విద్యాశాకా మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వీరిద్దరూ వధూవరులను ఆశీర్వదించారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, విశాఖ ఎమ్‌పి భరత్ తదితరులు పాల్గొన్నారు.

– ప్రజాశక్తి, భోగాపురం

బెల్ట్ జోరు



జిల్లాలో మద్యం బెల్టుషాపులు ఊరూరా విచ్చలవిడిగా సాగుతున్నాయి. బెల్ట్ షాపుల ద్వారా మద్యం అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ముఖ్యమంత్రి నుంచి జిల్లా ఎక్సైజ్ అధికారులు వరకు హెచ్చరిస్తున్నప్పటికీ యథేచ్ఛగా పుట్టగొడుగుల్లో బెల్టు షాపులు ఊరూరా ఏర్పాటవుతున్నాయి. నిబంధనలను తుంగలోతొక్కి పుట్టగొడుగుల్లా మరోవైపు బెల్ట్ షాపులకు అమ్మకాలు చేసిన వైన్ షాపుల లైసెన్సులను రద్దు చేస్తామని అధికారులు హెచ్చరికలు జారీ చేసినా అవేవీ పట్టించుకోకుండా బెల్ట్ షాపుల నిర్వహణకు సిండికేట్ మద్యం దుకాణదారులు పూర్తిస్థాయిలో ప్రోత్సహించడంతో ప్రతి గ్రామాల్లో మద్యం ఏరులై పారుతుంది. పర్యవేక్షణ చేయాల్సిన ఎక్సైజ్, పోలీస్ అధికారులు ప్రేక్షక పాత్ర పోషించడంతో సిండికేట్ వ్యాపారులు గ్రామాల్లో బెల్టుషాపుల నిర్వహణను ప్రోత్సహిస్తున్నారు. లైసెన్సు దుకాణాల్లో మద్యం అమ్మకాలు చేయాల్సి ఉండగా, వచ్చిన స్టాకు వచ్చినట్టే బెల్టుషాపులకు బాహాటంగానే తరలిస్తున్నారు.

- పుట్టగొడుగుల్లా గొలుసు దుకాణాలు
- రూ.లక్షల్లో వేలం పాటలు
- గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న ఎక్సైజ్ అధికారులు

ప్రజాశక్తి – గజపతినగరం, డెంకాడ

గ్రామాల్లో బెల్టుషాపులకు లక్షల రూపాయలకు వేలం పాటలు వేస్తున్నారు. గజపతినగరం మండలంలో పాతబగ్గాంలో రూ.6లక్షలకు, గంచోళ్లపెంట రూ.9లక్షలు, కొత్తబగ్గాం 6లక్షలు, లింగాలవలసలో 7లక్షలు, తుమ్మికాపల్లి, కెంగువ, ఇలా ఏ గ్రామంలో చూసినా వేలం పాటలు అయినట్లు తెలిసింది. దత్తిరాజేరు మండలంలోని కొన్ని గ్రామాల్లో ఆలయ నిర్మాణాల పేరిట బెల్టుషాపుల నిర్వహణకు వేలం వేసినట్లు తెలిసింది. ఎక్సైజ్ అధికారులు అడపా దడపా మద్యం బాటిళ్లనుపట్టుకుంటున్నప్పటికీ అవి ఎక్కడ కొనుగోలు చేశారు? ఎవరు విక్రయించారు? అనే అంశాలపై ఆరా తీయకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. షాపులను వేలాది రూపాయలకు వేలం పాట పాడు కోవడంతో తక్కువ కాలంలో ఎక్కువ సంపాదించుకోవాలనే ఉద్దేశంతో బెల్టుషాపులను మద్యం షాపుల యజమానులు ప్రోత్సహిస్తున్నారు. ఈనేపథ్యంలోనే గజపతినగరంలోని పాస్ట్‌ఫుడ్‌సెంటర్లలో కూడా మద్యం అమ్మకాలు సాగి పోతున్నాయి.

పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు

డెంకాడ మండలంలో మద్యం బెల్ట్ షాపులు విచ్చలవిడిగా సాగుతున్నాయి. మామూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం మానేశారన్న విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వం ఒకపక్క బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్న ఆ హెచ్చరికలను ఎక్సైజ్ అధికారులు బెల్ట్ షాపు నిర్వాహకులు పెడచెవిన పెట్టి వారి పని వారు చేసుకుంటూ పోతున్నారు. మండలంలో ఆరు మద్యం షాపులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ షాపుల ఆధ్వర్యానే గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో వారే పాటలు నిర్వహించి ఆ డబ్బులు గ్రామాభివృద్ధికి ఉపయోగ పడతాయని చెప్పి బెల్టుషాపులను ప్రోత్సహిస్తున్నారు. వీరికి ఎక్సైజ్ అధికారులు వత్తాసు పలుకుతూ గ్రామాల్లో దాడులు నిర్వహించడం మానేశారు ఒకవేళ పైనుంచి ఒత్తిడి ఉంటే మద్యం షాప్ యజమానులే బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న ఒకరిద్దరిని ఎక్సైజ్ అధికారులకు పట్టించి వారే మళ్లీ వారిపై కేసులు లేకుండా చేస్తున్నారు. మండలంలో గుణుపూర్ పేట గ్రామంలో 13 లక్షల 70 వేల రూపాయలకు బెల్టుషాపు వేలం వేశారు. అందులో రూ.3లక్షలు గ్రామపంచాయతీకి చెల్లించారు.

స్థానిక పోలీసులకు సమాచారం రావడంతో రెండు మూడు సార్లు దాడులు చేసి బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న వారిని పట్టుకుని వారిపై కేసులు పెట్టారు. అయితే ఇక్కడ మళ్లీ బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు. పెదతాడివాడ పంచాయతీ పరిధి గుండాలపేటలో రూ.3.40లక్షలకు వేలం పాట వేసినట్లు తెలిసింది. ఇక్కడ కూడా ఎక్సైజ్ అధికారులు రెండుసార్లు దాడి చేసి వారి దగ్గర మామూలు తీసుకొని వారిపై కేసులు పెట్టకుండా వదిలేసినట్లు తెలిసింది. విషయాలన్నీ ఎక్సైజ్ శాఖ అధికారులకు తెలిసిన తెలిసి తెలియనట్లు షాపులు వద్ద మామూలు తీసుకొని ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు.

'కౌలు' రుణాలకు ప్రత్యేక శిబిరాలు

4 రోజుల్లో 126 మందికి రుణాలు : కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో సిసిఆర్ కార్డు కలిగిన కౌలురైతులకు రుణాలు మంజూరు చేయించే లక్ష్యంతో ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించామని కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వెల్లడించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రత్యేక శిబిరాల ద్వారా 462 మంది కౌలురైతులను రుణాల మంజూరుకు బ్యాంకుల వద్దకు తీసుకువెళ్లి, 126 మంది రైతులకు రూ.50.92 లక్షల రుణాలు మంజూరు చేయించినట్లు చెప్పారు. జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు 1379 మంది కౌలు రైతులకు పంట రుణాలుగా రూ.7.01 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. కౌలురైతులకు రుణాల మంజూరుకు సంబంధించి రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి దృష్టికి తీసుకువెళ్లడంతో అక్కడి నుంచి జిల్లాలోని బ్యాంకుల కంట్రోలర్లకు కౌలురైతులకు రుణాలు మంజూరు చేయాలంటూ ఆదేశాలు వచ్చాయని పేర్కొన్నారు. ఈ మేరకు కౌలు రైతులను వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బ్యాంకుల వద్దకు తీసుకువెళ్లి రుణాలు మంజూరు చేయించేందుకు ప్రత్యేక క్యాంపెయిన్ చేపట్టామని కలెక్టర్ వెల్లడించారు.

స్పెషల్ క్యాంపెయిన్‌లో భాగంగా ఎపి గ్రామీణ వికాస్ బ్యాంకు 111 మందికి రూ.44.82 లక్షలు, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా 8 మందికి రూ.3.1 లక్షలు, ఎస్‌బిఐ ద్వారా నలుగురికి రూ.2 లక్షలు, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు ముగ్గురికి రూ.లక్ష మంజూరు చేశాయని వివరించారు. జిల్లాలో ఈ ఏడాది యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ద్వారా 361 మందికి, ఎపి గ్రామీణ వికాస్ బ్యాంకు ద్వారా 494 మందికి, స్టేట్ బ్యాంకు ద్వారా 318 మందికి, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ద్వారా 91 మందికి, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు ద్వారా 54 మందికి, పోలిపల్లి రైతు సేవా సహకార సంఘం ద్వారా 32 మందికి, కెనరా బ్యాంకు ద్వారా 14 మందికి, ఇండియన్ బ్యాంకు ద్వారా ఐదుగురికి, పంజాబ్ నేషనల్ బ్యాంకు ద్వారా ఇద్దరికి రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు.

నిబంధనలు పాటించకుంటే లైసెన్స్ రద్దు

రహదారి భద్రతపై అవగాహన ఉండాలి : కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలు పాటించాలని, ఇకపై నిబంధనలు పాటించని వారి లైసెన్స్‌ను రద్దు చేస్తామని జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ వేగం కన్నా సురక్షితంగా చేరడం ముఖ్యమని తెలిపారు. ప్రతి వాహన దారుడు తాను సురక్షితంగా ఉంటూ పక్క వారిని కూడా సురక్షితంగా ఉంచాలన్నారు. ప్రమాదాలు తరచుగా జరిగే ప్రదేశాలను గుర్తించి సిసి కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉప రవాణా కమిషనర్ మణి కుమార్ మాట్లాడుతూ రహదారి భద్రత సామాజిక బాధ్యతగా భావించాలని తెలిపారు. దేశంలో ఏటా సుమారు 2 లక్షల మంది ప్రమాదాల వల్ల ప్రాణాలు కోల్పోతున్నారని, 18 ఏళ్ల లోపు వయసున్న పిల్లలకు వాహనాలను ఇవ్వరాదని కోరారు. రహదారి భద్రత పాఠ్య పుస్తకాలలో ఒక పాఠం గా చేర్చాల్సి ఉందన్నారు. ఆర్‌టిసి అధికారి అప్పలనారాయణ మాట్లాడుతూ బస్సులన్నింటిని రహదారి భద్రతపై ఆడిట్ చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఉత్తమ డ్రైవర్లుగా నిలిచిన జిల్లా కలెక్టర్ డ్రైవర్ కృష్ణ, ఎస్‌పి డ్రైవర్ ప్రసన్నకుమార్, ఆర్.టి.సి లో పని చేస్తున్న ఉత్తమ డ్రైవర్లకు, రహదారి భద్రత పై అవగాహన కలిగిస్తున్న ఎన్.సి.సి క్యాడెట్లకు ప్రశంసా పత్రాలను, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో లారీ అసోసియేషన్ , ఆటో అసోసియేషన్ ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



తన కారు డ్రైవర్ కృష్ణకు ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందిస్తున్న కలెక్టర్





అనకాపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి విజయ గౌరి ; విజయనగరంలో ప్రయివేటు కళాశాల అధ్యాపకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ

అవకాశమివ్వండి.. మీ గళం వినిపిస్తా..

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

ప్రజాశక్తి-అనకాపల్లి

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేస్తున్న తనను గెలిపిస్తే చట్టసభల్లో ఉపాధ్యాయుల గొంతు వినిపిస్తానని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. శనివారం ఆమె అనకాపల్లిలోని చినబాబు కాలనీ, గుండాల వీధి తదితర ప్రాంతాల్లో ఉపాధ్యాయుల ఇళ్లకు వెళ్లి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయుల పిఆర్‌సి సమస్యపైనా, హక్కులు, విద్యా రంగ పరిరక్షణ కోసం నికరంగా పోరాడుతున్న యుటిఎఫ్, ఇతర ఉపాధ్యాయ సంఘాలు తనను బలపరుస్తున్నట్టు తెలిపారు. గతంలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీలుగా పని చేసి, ప్రస్తుతం అభ్యర్థులుగా ఉన్న ఇద్దరు ఉపాధ్యాయ సమస్యలను పక్కనపెట్టి అధికార పార్టీ ప్రభుత్వాలతో అంటకాగారని, ఉపాధ్యాయుల హక్కులను తాకట్టు పెట్టి వారి సొంత ప్రయోజనాల కోసమే పని చేశారని గుర్తు చేశారు. అటువంటి వారిని ఓడించాలని పిలుపునిచ్చారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ఉపాధ్యాయులు, ఉద్యోగుల కోసం రాజీలేని పోరాటాలు నిర్వహించారని, అటువంటి పిడిఎఫ్ తరుపున పోటీ చేస్తున్న తనను గెలిపించాలని కోరారు.

విజయగౌరిని గెలిపించండి : ఎంవిఎస్ శర్మ

విజయనగరం టౌన్ : ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి పోటీచేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి కె.విజయగౌరిని గెలిపించాలని ఉత్తరాంధ్ర పట్టభద్రుల మాజీఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ ఉపాధ్యాయులను కోరారు. విజయగౌరికి మద్దతుగా శనివారం నగరంలోని పలు ప్రైవేటు కళాశాలలు, పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి ఎంవిఎస్ శర్మ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పిడిఎఫ్ ఎమ్మెల్సీలు అలుపెరుగని పోరాటం చేస్తున్నారని గుర్తు చేశారు. ప్రధానంగా ఉపాధ్యాయులకు, ప్రభుత్వ విద్యారంగానికి నష్టం వాటిల్లే విధానాలను వ్యతిరేకిస్తూ వాటి రద్దు కోసం పోరాడారని గుర్తు చేశారు. ప్రధానంగా ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకుల సంక్షేమానికి, వారి వాణిని చట్ట సభల్లో వినిపించాలంటే విజయగౌరిని గెలిపించాల్సిన అవసరం ఎంతయినా ఉందన్నారు. వెల్ఫేర్‌బోర్డు, ప్రత్యేక పింఛను స్కీం, హెల్త్‌కార్డుల మంజూరు, ఉద్యోగ భద్రత, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు కోసం పిడిఎఫ్ ఎమ్మెల్సీలు పోరాడుతారని తెలిపారు. కావున విజయగౌరిని మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కోరారు.

మరోవైపు జిల్లాలో జరిగిన స్కూలు కాంప్లెక్సుల్లో విజయగౌరికి ఓటు వేయాలని కోరుతూ యుటిఎఫ్ నాయకులు పలు చోట్ల ప్రచారం చేపట్టారు. యుటిఎఫ్‌జిల్లా ప్రధాన కార్యదర్శి జెవిఆర్‌కె ఈశ్వరరావు ఆధ్వర్యాన పలు ప్రైవేటు పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు.

సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

ప్రజాశక్తి-లక్కవరపుకోట

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. శనివారం లక్కవరపుకోటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. సుమారు వందకు పైగా దరఖాస్తులు అందాయి. వివిధ రకాల పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్లు, ఇంటి స్థలాలు, రోడ్డు నిర్మాణాలు, పలు రకాల విద్యుత్తు సమస్యలు వంటివి తమ దృష్టికి వచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. వెంటనే ఈ సమస్యల పరిష్కారం దిశగా సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడారు.

గ్రీన్ అంబాసిడర్ల సమస్యలపై వినతి

గ్రీన్ అంబాసిడర్ల సమస్యలను పరిష్కరించాలని ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యేకు సిఐటియు ఆధ్వర్యాన వినతి అందించారు. తొలుత స్థానిక సిఐటియు కార్యాలయం నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గాడి అప్పారావు ఆధ్వర్యాన గ్రీన్ అంబాసిడర్లు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్ల సంఘం జిల్లా అధ్యక్షులు దండి శ్రీనివాసరావు, సిఐటియు నాయకులు చెలికాని ముత్యాలు, గొల్ల కామేశ్వరరావు, సి.హెచ్ అప్పారావు, డి.గంగరాజు, చి.నాగరాజు, సోములు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు గ్రీన్ అంబాసిడర్ల సమస్యలను వివరిస్తున్న సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ

ఎన్‌డిపిఎస్ కేసుల్లో కచ్చితంగా శిక్షపడాలి

ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఎన్‌డిపిఎస్ కేసుల్లో నిందితులకు శిక్షపడేలా కేసులనుదర్యాప్తు చేయాలని ఎస్‌పి వకుల్‌జిందాల్ పోలీసు అధికారులకు సూచించారు. కేసుల దర్యాప్తులో మెళుకవుల నేర్పేందుకు ఒక్క రోజు వర్కుషాపు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఎన్‌డిపిఎస్ చట్టం చాలా కఠినమైనదని, చట్టంలో పొందుపర్చిన విధి, విధానాలను దర్యాప్తు అధికారులు పాటిస్తే, ఆయా కేసుల్లోని నిందితులు ఖచ్చితంగా శిక్షింపబడే అవకాశం ఉందన్నారు. గంజాయి, డ్రగ్స్ మరియు ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణ, వినియోగం, విక్రయాలకు పాల్పడే నిందితులు కఠినంగా శిక్షింపబడితేనే ఈ తరహా నేరాలకు అడ్డుకట్ట వేయగలమన్నారు. ఈ కేసుల్లో దర్యాప్తు అధికారులు ఏ చిన్న తప్పు చేసినా, నిందితులు శిక్షల నుండి తప్పించుకొనే అవకాశం ఉంటుందన్నారు. కావున, దర్యాప్తు అధికారులు ఈ తరహా కేసులను దర్యాప్తు చేసేటప్పుడు విధి, విధానాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. న్యాయస్థానాల్లో ఇప్పటికే వీగి పోయిన కేసుల్లో పోలీసు అధికారులు దర్యాప్తు చేయుటలో చేసిన తప్పిదాలను మళ్ళీ పునరావృతం కాకుండా

ఈ రోడ్డు బడిబస్సుకు పనికిరాదట!

ప్రజాశక్తి-వేపాడ

ఈ చిత్రంలో కనిపిస్తున్న తారురోడ్డు.. వేపాడ మండలంలోని సోంపురం నుంచి జాకేరు మీదుగా బక్కునాయుడుపేటకు వెళ్లే మార్గంలోనిది. ఆరు గ్రామాల మీదుగా వెళ్లే ఈ రహదారిలో నిత్యం పదుల సంఖ్యలో ఆటోలు, లారీలు, ప్రయివేటు బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. అలాంటి రోడ్డును ఆర్‌టిసి శృంగవరపుకోట డిపో అధికారులు.. బడిబస్సు నడపడానికి పనికిరాదని తేల్చేశారు. తుప్పలు, డొంకలు తొలగిస్తే తప్ప ఆర్‌టిసి బస్సు నడపలేమని స్పష్టంచేశారు. బక్కునాయుడుపేట వద్దనున్న ఆదర్శ పాఠశాలలో సుమారు 600 మంది విద్యార్థులు విద్యనభ్యశిస్తున్నారు. విద్యార్థుల కోసం ఆయా గ్రామాల సర్పంచులు, నాయకులు స్పందించి, ఆ మార్గంలో తుప్పలు, డొంకలు తొలగించారు. మరోవైపు బడిబస్సు ఏర్పాటు చేయాలని సాక్షాత్తూ జిల్లా మెజిస్ట్రేట్, కలెక్టర్ బిఆర్ అంబేద్కర్... ఆర్‌టిసి అధికారులను ఆదేశిఁచారు. అయినా శృంగవరపుకోట డిపో అధికారులు అవేవీ ఖాతరు చేయలేదు. మొండిపట్టు వీడలేదు. చివరికి, డిపో అధికారుల పుణ్యమా! అని ఆదర్శ పాఠశాల విద్యార్థులు నానా వ్యయ ప్రయాసలకోర్చి ప్రయివేటు వాహనాల ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో సమయానికి పాఠశాలకు చేరుకోలేకపోతున్నారు. ఇలాంటి తరుణంలో మరో రెండు వారాల్లో ఇంటర్ పరీక్షలు, నెల రోజుల్లో పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి బడిబస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



సోంపురం, జాకేరు మీదుగా ఆదర్శ పాఠశాలకు వెళ్లే రోడ్డు ఇదే

ఐఆర్‌పిడబ్ల్యుఎ డైరెక్టర్ ప్రకాశ్ మృతి

ప్రజాశక్తి – పార్వతీపురంరూరల్

పార్వతీపురం పట్టణానికి చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త, ఐఆర్‌పిడబ్ల్యుఎ ఎన్‌జిఒ సంస్థ డైరెక్టర్, పార్వతీపురం మన్యం జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులు పెదిరెడ్ల ప్రకాశ్ శనివారం ఉదయం విజయనగరం ఒక ప్రైవేటు ఆసుపత్రిలో గుండెపోటుతో మరణించారు. ఈయన ఎన్‌జిఒ సంస్థ ద్వారా చాలా కాలంగా ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మృతికి జిల్లావ్యాప్తంగా పలువురు తీవ్ర సంతాపాన్ని దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.



చెరకు రైతుల్ని ముంచేశారు

ప్రజాశక్తి – విజయనగరం ప్రతినిధి

ఔను...! మొత్తానికి జిల్లాలోని భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ పరిధిలోని చెరకు రైతుల్ని పాలకులు ముంచేశారు. దశాబ్దాల చరిత్రగల ఈ ఫ్యాక్టరీని మూసివేశారు. ఈ విషయం తాజాగా ఆ ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ విఎస్ నాయుడు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనతో మరోసారి స్పష్టమైంది. ఈ విషయంలో నాటి వైసిపి, టిడిపి ప్రభుత్వాలు దొందూ దొందే. ఆయా పార్టీలు, ప్రభుత్వాలు చెరకు రైతులపై ఇన్నాళ్లూ కార్చింది మొసలి కన్నీరేనని స్పష్టమైంది. ఉమ్మడి విజయనగరం జిల్లా ఒకప్పుడు చెరకు సాగుకు పెట్టింది పేరు. జిల్లాలో పెద్దగా సాగునీటి వనరులు లేకపోవడం వల్ల చెరకు పంటే గత్యంతరంగా ఉండేది. దీనికితోడు ఆ పంట సాగుకు ఈ ప్రాంత భూములు కూడా ఎంతో అనువుగా ఉన్నాయి. ఈనేపథ్యంలో జామి మండలంలోని భీమసింగి దరి కుమరాంలో శ్రీ విజయరామ గజపతి కో–ఆపరేటివ్ సుగర్ ఫ్యాక్టరీని 1960లో అప్పటి ప్రభుత్వమే సహకారం రంగంలో ఏర్పాటు చేసింది. లక్ష్యానికి తగ్గట్టే ఈ ప్రాంత అభివృద్ధిలో ఫ్యాక్టరీ కీలకపాత్ర పోషించింది. పాలకుల నిర్లక్ష్యం వల్ల మారుతున్న టెక్నాలజీ అందుకోవడంలో అనేక సవాళ్లు ఎదుర్కొన్నప్పటికీ రైతులకు ఎంతో ఆసరాగా నిలిచింది. ఒకప్పుడు చంద్రబాబు ప్రభుత్వమే దీన్ని మూసివేసింది. 2004 ఎన్నికలకు ముందు వైఎస్ రాజశేఖరరెడ్డి తన పాదయాత్రలో భాగంగా ఫ్యాక్టరీని తెరిపించేందుకు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన కొన్నాళ్లకు మాట నిలబెట్టుకున్నారు. దీంతో, రైతులు ఒకింత ఊపిరి పీల్చుకుంటూ చెరకు సాగుపై మరింత ఉత్సాహం చూపారు. చెరకు స్థానికంగానే విక్రయించుకునే పరిస్థితి ఉండడం వల్ల రైతులు, తిరిగి పున:ప్రారంభం వల్ల అందులో పనిచేస్తున్న వందలాది మంది కార్మికులు, ఉద్యోగుల జీవితాలకు భరోసా కలిగింది. చెరకు బళ్లు, రైతులు, కార్మికులు, ఉద్యోగులతో భీమసింగి ప్రాతంలో నిత్యం కళకళాడేది. 2014లో తిరిగి చంద్రబాబు అధికారంలోకి వచ్చాక సహకార రంగాన్ని నిర్వీర్యం చేసే విధానాలు అవలంభించడంతో ఫ్యాక్టరీ మనుగడ కష్టనష్టాల్లోకి వెళ్లింది. 2019 ఎన్నికల ముందు ఈ ప్రాంత పర్యటనకు వచ్చిన వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి ఈ ఫ్యాక్టరీని ఆధునీకరిస్తామని, తన తండ్రి పున:ప్రారంభించిన ఈ ఫ్యాక్టరీని చంద్రబాబు కుదేలు చేశారు. ఈ మాటలు నమ్మిన ఈ జిల్లా, భీమసింగి ప్రాంతవాసులు వైసిపికి పట్టం కట్టారు. ఓడదాటే వరకు ఓడమల్లన్న.... ఓడ దాటకా బోడి మల్లన్న అన్నట్టుగా ఆధునీకరణ పేరిట 2019 ఆగస్టులో చెరకు క్రషింగ్ నిలిపివేశారు. ఎప్పటికీ తెరవరకపోవడంతో సిపిఎం ఆధ్వర్యాన రైతులు సుదీర్ఘమైన పోరాటాలు చేసిన సంగతి తెలిసిందే. నాటి జిల్లాకు చెందిన మంత్రి బొత్స సత్యనారాయణ ఇదిగో అదిగో అంటూనే చివరికి ఫ్యాక్టరీ సామర్థ్యానికి తగ్గట్టు చెరకు సాగుచేయడంలేదంటూ రైతులపైకి నెట్టేశారు. గత ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే ఫ్యాక్టరీ భవిష్యత్తు కోసం ఆలోచిస్తామన్న చంద్రబాబు ప్రభుత్వం నోరు తెరవడం లేదు. పైగా జిల్లాకు చెందిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఫ్యాక్టరీ నష్టాల్లో ఉందని వ్యాఖ్యానించారు. ఫ్యాక్టరీని తెరిపించాలంటూ ఇటీవల రైతులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో ఫ్యాక్టరీ ఎమ్‌డితో ప్రభుత్వం ఒక ప్రకటన ఇప్పించింది. 'ఫ్యాక్టరీలో 2020–21 సీజన్ నుంచే చెరకు క్రషింగ్ నిలుపుదల చేశాం. ఇందులో పనిచేస్తున్న వివిధ కేటగిరీల ఉద్యోగులు, కార్మికుల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. వీటితోపాటు విఆర్‌ఎస్ వివరాలను 2022 జూన్ 12న జరిగిన ది గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ సమావేశం కోరింది' అంటూ ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు. దీన్ని బట్టి ఫ్యాక్టరీ మూతలో రెండు ప్రభుత్వాలదీ ఒకటే విధానం అన్నది తేలిపోయింది.



ఫ్యాక్టరీ సామర్థ్యానికి తగ్గట్టు చెరకు సాగుచేయడం లేదంటూ రైతులపైకి పాలకులు నెట్టేశారు. కానీ, సాగు విస్తీర్ణం పెరగాలంటే చెరకు రైతులను ప్రోత్సహించాలి కాదా? అలా ప్రోత్సహించాల్సిన బాధ్యత, అవసరం ప్రభుత్వానికి లేదా? నాటి ప్రభుత్వం ఎందుకు అలాంటి ప్రయత్నం చేయలేదు అంటూ రైతులు, ఎపి రైతు సంఘం నాయకులు, చెరకు రైతుల సంఘం నాయకులు నాటి నుంచీ ప్రశ్నిస్తునే ఉన్నారు. ఒకప్పుడు ఉమ్మడి జిల్లాలో చెరకు సాగువిస్తీర్ణం 50వేల ఎకరాలకుపైగా ఉండేది. వైసిపి ప్రభుత్వంలోగానీ, టిడిపి ప్రభుత్వంలోగానీ చెరకు పరిశోధనలు నిర్వహించలేదు. ఫలితంగా సుమారు పదేళ్లగా కొత్తరకం విత్తనాలు అందుబాటులో లేకపోవడం వల్ల దిగుబడి కూడా సగానికి సగం తగ్గిపోతోంది. సుగర్ రికవరీ రేటు కూడా మన రాష్ట్రంలో 9.5శాతానికి మించిరావడం లేదు. మరోవైపు చెరకు రైతులకు సబ్సిడీ పథకాలు లేవు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉత్పత్తికి అయ్యే ఖర్చుపై మద్దతు ధర ప్రకటించకపోవడం వల్ల రైతులకు గిట్టుబాటు కాని పరిస్థితి. ధరలో లోటును భర్తీచేసే చెరకు పాలసీని కూడా పదేళ్ల క్రితమే అప్పటి రాష్ట్ర ప్రభుత్వం రద్దుచేసింది. దీంతో, జిల్లాలో క్రమంగా సాగు విస్తీర్ణం తగ్గింది. ఇందుకు బాధ్యత వహించాల్సిన ప్రభుత్వమే రైతులపైకి నెట్టేయడం ఎంత వరకు సమంజసం అని రైతులు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు ఫ్యాక్టరీ నష్టాల్లో ఉందంటూ మంత్రి కొండపల్లి చేసిన వ్యాఖ్యలు కూడా నేటి ప్రభుత్వ విధానాన్ని, మోసకారి తనాన్ని బయటపెట్టాయి. వాస్తవానికి సహకార సంఘాలను ఏర్పాటుచేసింది లాభాలు ఆర్జించడం కోసం కాదు. లాభ నష్టాలతో సంబంధం లేకుండా రైతులకు లేదా సంబంధిత రంగాలకు చెందిన ప్రజలకు చేదోడువాదోడుగా ఉండేందుకు. ఈ సంగతి అమాత్యులకు తెలియదనుకోలేం. చంపేయాలనుకున్న కుక్కపై పిచ్చికుక్కగా ముద్రవేసి పనికానిచ్చినట్టే... ఫ్యాక్టరీని మూసేయాలనే ప్రభుత్వ విధానంలో భాగంగానే ఆయన నోట వెనుక లాభనష్టాలు గుర్తుకు వచ్చాయి అనేది పబ్లిక్ టాక్.



స్కూల్ కాంప్లెక్సులో మాట్లాడుతున్న డిఇఒ మాణిక్యం నాయుడు

వృత్తిపరమైన అభివృద్ధికి స్కూల్ కాంప్లెక్సులు దోహదం

డిఇఒ మాణిక్యంనాయుడు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వృత్తిపరమైన అభివృద్ధికి స్కూల్ కాంప్లెక్సులు దోహదం చేస్తాయని జిల్లా విద్యా శాఖ అధికారి యు.మాణిక్యం నాయుడు తెలిపారు. శనివారం దాసన్నపేటలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల వృత్తిపరమైన అభివృద్ధికి ఈ సమావేశాలు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. విద్యార్థుల నైపుణ్యానికి, అభ్యసనాభివృద్ధికి ఈ సమావేశాలు ఉపయోగపడాలన్నారు. పదో తరగతి విద్యార్థుల కోసం ఎస్‌సిఇఆర్‌టి విడుదల చేసిన 100 రోజుల ప్రణాళిక తప్పక అమలు చేసి శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. సమావేశంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికులకు రక్షణ పరికరాలు ఇవ్వాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు రక్షణ పరికరాలు ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు జె.శ్యామలరావు కేన్సర్‌తో మరణించడంతో శనివారం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులకు రక్షణ పరికరాలు ఇవ్వకపోవడంతో అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. చిన్న వయసులోనే అనారోగ్యం బారిన పడి మరణించడం బాధాకరమన్నారు. వారికి రక్షణ పరికరాలు ఇవ్వాలని మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జె.రామారావు, బి.యుగంధర్, జి. శంకర్రావు కార్మికులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు రక్షణ ఏది?

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు రక్షణ లేదని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మువ్వల శ్రీనివాసరావు అన్నారు. శనివారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. భద్రతా జాగ్రత్తలు తీసుకోకుండా శానిటరీ ఇన్‌స్పెక్టర్.. కార్మికులతో ఎలా పని చేయిస్తున్నారని ప్రశ్నించారు. యూనిఫాం, మాస్కులు, గ్లౌజులు, షూ లాంటి రక్షణ పరికరాలు ఇవ్వకుండా పనిచేయిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపాలిటీలో ప్రధాన పాత్ర పోషిస్తున్న పారిశుధ్య శాఖకు అధిక స్థాయిలో నిధులు కేటాయించాలన్నారు. రోగాల బారిన పడిన కార్మికులకు ఆధునిక వైద్యం అందించాలని డిమాండ్‌చేశారు. మరణించిన కార్మికుల కుటుంబానికి రూ.50 లక్షలు ఆర్థిక సహాయం అందించాలని, ఆ కుటుంబంలో అర్హులైన వారికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు.

వల్లూరు ఫీల్డ్ అసిస్టెంట్ తాత్కాలిక తొలగింపు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

వల్లూరు ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌ను తాత్కాలికంగా విధుల నుంచి తొలగించినట్లు ఎంపిడిఒ కె.రామకృష్ణరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ వల్లూరు ఫీల్డ్ అసిస్టెంట్ బి. చంద్ర కళ పై 18వ విడత సోషల్ ఆడిట్, గ్రామం నుంచి వచ్చిన ఫిర్యాదులు మేరకు విచారణ చేసి ఆమెను విధుల నుంచి తాత్కాలికంగా తొలగిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశామన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ తనపై వచ్చిన అభియోగంపై 14 రోజుల్లో పీడీ దగ్గర అప్పీల్ చేసుకొనే అవకాశం కల్పించినట్లు ఆయన తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభం

ప్రజాశక్తి-గంట్యాడ

ప్రకృతి వ్యవసాయంతో ఎంతో లాభమని ఎపిసిఎన్ఎఫ్ డిపిఎం ఆనందరావు తెలిపారు. శనివారం గంట్యాడలోని సమాఖ్య కార్యాలయంలో మండల సమాఖ్య సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 9 పంచాయతీల్లో ప్రకృతి వ్యవసాయం ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ప్రకృతి సాగు వల్ల ప్రయోజనాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో ఎపిఎం, మండల సమాఖ్య సభ్యులు, విఒఎలు, సిసిలు పాల్గొన్నారు.

కొత్తవలస : ఎంపిడిఒ కార్యాలయంలో ఇఒపిఆర్‌డి శ్రీదేవి ఆధ్వర్యంలో వ్యక్తిగత కంపోస్ట్ పిట్స్, కిచెన్ గార్డెన్ ఏర్పాటుపై సమావేశం నిర్వహించారు. ఎంపిడిఒ రమణయ్య మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ప్రాధాన్యతను వివరించారు. సమావేశంలో ఎపిఎం యు.ఉమామహేశ్వరరావు, ఎపిఎం (ఎఫ్‌పిఒ) ఎ.వెంకటరమణ, ఎఒ మాధురి శరణ్య, ఎపిసిఎన్ఎఫ్ సిబ్బంది శ్రావ్య, ఉషారాణి, దేముడమ్మ, శ్యామల పాల్గొన్నారు.

చెరువు కబ్జాపై సమగ్ర దర్యాప్తు : సిపిఎం

ప్రజాశక్తి-బొబ్బిలి

రామభద్రపురం మండలం కొట్టక్కి సమీపంలో జాతీయ రహదారి పక్కనున్న చెరువు ఆక్రమణపై సమగ్ర దర్యాప్తు చేసి, చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు అధికారులను డిమాండ్ చేశారు. చెరువు ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం ఆర్‌డిఒ రామ్మోహనరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువు ఆక్రమణపై గతేడాది రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తే చెరువు ఆక్రమణకు గురైనట్లు గుర్తించి, బోర్డు ఏర్పాటుచేశారని, దాన్ని తొలగించి మరీ ఆక్రమణకు పాల్పడుతున్నారని చెప్పారు. రికార్డులను తారుమారు చేసి ఆక్రమణ చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్.గోపాలం, బి.శ్రీనివాసరావు, సురేష్, యుగంధర్ పాల్గొన్నారు.

లెండిలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి- డెంకాడ

జొన్నాడ సమీపంలోని లెండి ఇంజినీరింగ్ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొని 250 యూనిట్లను రక్తదానం చేశారు, ఎన్‌టిఆర్ మెమోరియల్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంక్, వైజాగ్, రోటరీ పార్వతిదేవి అంచలియా వాలంటరీ బ్లడ్ సెంటర్, ఎన్‌విఎన్ బ్లడ్ బ్యాంక్, రోటరీ బ్లడ్ బ్యాంక్, విశాఖకు చెందిన ఎఎస్ రాజా వాలంటరీ బ్లడ్ సెంటర్‌ల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్. రవితేజ నాయకత్వంలో నిర్వహించిన శిబిరంలో చైర్మన్ మధుసూదన్ రావు, వైస్ చైర్మన్ పి.శ్రీనివాస్‌రావు, , కార్యదర్శి, కరస్పాండెంట్ కె.శివరామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి.రామారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్‌తమ్మినేని హరిబాబు పాల్గొన్నారు

ఆటో నుంచి జారిపడి మహిళ మృతి

ప్రజాశక్తి-తెర్లాం

మండలంలో కొరటాం గ్రామ సమీపంలో శనివారం ఆటో నుంచి జారిపడి మర్రి పద్మ(39) మృతి చెందింది. మెరకముడిదాం మండలం ఉత్తరావల్లి గ్రామానికి చెందిన మర్రి పద్మ(39).. బలిజిపేట మండలం గొంగాడలో బంధువు మరణించడంతో కొంతమందితో కలిసి బయల్దేరి వెళ్లింది. కొరటాం సమీపంలో ఆటో నుంచి జారిపడి ఆమె అక్కడికక్కడే మరణించింది. ఆమె భర్త దుర్గారావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ సాగర్‌బాబు కేసు నమోదు చేశారు. మృతదేహానికి బాడంగి సిహెచ్‌సిలో పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జిపై శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు గాయపడ్డారు. బొబ్బిలి నుంచి గ్రోత్ సెంటర్ వైపు మోటారు సైకిల్ పై వెళ్తున్న వీరు ఎదురుగా వస్తున్న కారును ఢీకొనడంతో గాయపడ్డారు. వీరిని వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

● జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ ● జిల్లా అంతటా స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యమని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లో 3వ శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది వారి కార్యాలయాల పరిసరాలలో నున్న చెత్తను, ప్లాస్టిక్ ను ఏరివేసి పోగులుగా వేయగా మున్సిపల్ వాహనంలో వాటిని తొలగించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ కలెక్టరేట్ ఆవరణలో అధికారులు సిబ్బందితో స్వచ్ఛంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కలెక్టరేట్ లోపల పర్యటించి అన్ని శాఖల పరిసరాలను తనిఖీ చేసారు. బయట లోపల ఉన్న చెత్తలను పరిశుభ్రం చేసి ప్లాస్టిక్ , వ్యర్థాలను తొలగించాలని అధికారులకు ఆదేశించారు. ప్రతి కార్యాలయం లో మూడు రంగుల బిన్లను ఏర్పాటు చేయాలని జెసి సూచించారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ శ్రీనివాస మూర్తి, సిపిఒ బాలాజీ, కలెక్టరేట్ ఎఒ దేవ్ ప్రసాద్, కలెక్టరేట్ లో నున్న అన్ని శాఖల నుండి అన్ని సెక్షన్ల నుండి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛంధ్ర,స్వచ్ఛ దీవస్ కార్యక్రమం

విజయనగరంటౌన్ : దాసన్నపేట విద్యుత్ భవనంలో 'స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్' కార్యక్రమం నిర్వహించి స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేసారు. ఈ సందర్భంగా ఎస్ఇ ఎం.లక్ష్మణరావు మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో డిజియం కె.వి.లక్ష్మీనారాయణ, ఎస్ఎఒ వి. రాంబాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు పి. త్రినాథ్, కెవి సత్యన్నారాయణ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి : కమిషనర్

చిన్నతనం నుండే పరిసరాల పరిశుభ్రత పట్ల అవగాహన కలిగి ఉండాలని విద్యార్థులకు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఉద్బోధించారు. స్థానిక కస్పా హైస్కూల్లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ప్రతి తరగతి గదికి చెత్త బుట్టలను అందజేశారు. పారిశుధ్యం పరిశుభ్రత పట్ల అవగాహన కల్పించే పోస్టర్లను కాలుష్య నియంత్రణ మండలి ఇఇ సరిత, ఇతర ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. విద్యార్థులతో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో కస్పా హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శంకర్రావు, పలువురు ఉపాధ్యాయులు, పారిశుధ్య పర్యవేక్షకుడు షాలేం రాజు, కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది పాల్గొన్నారు.

అనంతరం బాబా మెట్టలోని, దేవి పార్కు వద్ద నిర్వహించిన స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో కమిషనర్ పాల్గొన్నారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీగా వెళ్లి బాబా మెట్ట ప్రధాన జంక్షన్లో మానవహారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, టిపిఆర్‌ఒ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు, ఎఇ పార్వతి, పారిశుధ్య పర్యవేక్షకులు బాలకృష్ణ, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డి.అప్పారావు ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర మిషన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమ ఆవశ్యకతను చరిత్ర శాఖ అధ్యాపకులు రెడ్డి ఉమామహేశ్వర వివరించారు. విద్యార్థులతో ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, శ్రీనివాసరావు, డి.అప్పారావు ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో ఐక్యూ. ఎసి కోఆర్డినేటర్ డాక్టర్ జివిఎస్ జయపాల రావు, సీనియర్ అధ్యాపకులు, డాక్టర్. పి.విజయలక్ష్మి, డాక్టర్ బి.శుభ , డాక్టర్. పి.రూప వాణి, డాక్టర్ ఎం. రమా గీతా దేవి, డాక్టర్ సుభాషిని తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత తప్పనిసరి

విజయనగరం కోట : పరిసర ప్రాంతాలను తప్పనిసరిగా పరిశుభ్రంగా ఉంచాలని నారాయణ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ ఎం నారాయణ రావు అన్నారు. పాఠశాలలో స్వచ్ఛంద స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు నిర్వహించారు. ముందుగా స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు.

స్వచ్ఛత కార్యక్రమాలు

వేపాడ : వేపాడలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ, ఎంపిడిఒ సూర్యనారాయణ ఆధ్వర్యాన ప్రతిజ్ఞ చేయించారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎపిఎం సన్యాసిరావు,ఎపిఒ ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. వేపాడ గురుకులం ప్రిన్సిపల్ యు.ఉషారాణి ఆధ్వర్యాన స్వచ్ఛతపై అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



విజయనగరంటౌన్ : విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ పి.నల్లనయ్య



కలెక్టరేట్ ఆవరణలో జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యాన చేస్తున్న స్వచ్ఛత కార్యక్రమం

బొబ్బిలి : పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉండగలమని సిహెచ్‌సి సూపరింటెండెంట్ జి.శశిభూషణరావు అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ నిర్వహించారు. ఎక్సైజ్ కార్యాలయంలో పరిసరాలను సిఐ పి.చిన్నంనాయుడు, సిబ్బంది శుభ్రం చేశారు. మున్సిపాలిటీలో కమిషనర్ ఎల్.రామలక్ష్మి తడి, పొడి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆన్ కంపోస్టు విధానంపై అపార్టుమెంటులో ప్రజలకు అవగాహన కల్పించారు.

గజపతినగరం : స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ఎంపిడిఒ కార్యాలయంలో చేపట్టారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బి.కళ్యాణి, ఎపిఎం సత్యనారాయణ పాల్గొన్నారు.

నగర పంచాయతీలో స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర

నెల్లిమర్ల : నగర పంచాయతీలో కమిషనర్ కె.అప్పలరాజు, కెజిబివి విద్యార్థులు కలిసి సువ్వాని వీధిలో ప్రజలకు, స్వయం సహాయక సంఘ గ్రూపు సభ్యులకు, తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసే విధానం, హోమ్ కంపోస్ట్ తయారీ చెత్తను వేరు వేరుగా అందించడంపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.ఉమాభాస్కర్, సచివాలయ కార్యదర్శులు, మెప్మా సిఒలు, ఆర్‌పిలు పాల్గొన్నారు.

రాజాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిడిఒ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛంద్ర, స్వర్ణంద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. పారిశుధ్య నిర్వాహణలో లోపాలు తలెత్తకుండా పల్లెలను పరిశుభ్రతకు నెలవుగా మారుస్తామని ప్రతిజ్ఞలు చేశారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న ఎపిసి రామారావు

పదో తరగతే తొలిమెట్టు

సమగ్ర శిక్ష ఎపిసి రామారావు

ప్రజాశక్తి-వేపాడ

విద్యార్థి బంగారు భవితకు పదో తరగతే తొలిమెట్టని సమగ్ర శిక్ష ఎపిసి రామారావు తెలిపారు. శనివారం మండలంలోని బక్కునాయుడుపేట వద్దనున్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన సందర్శించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులతో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం తరగతి గదులను పరిశీలించారు. కెజిబివి ఆవరణమంతా పరిశుభ్రంగా ఉందంటూ సంతృప్తి వ్యక్తంచేశారు. పదో తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించాలని అక్కడి ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కెజిబివి ప్రిన్సిపల్ కిరణ్మయి పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన

మండలంలోని బొద్దాం, వేపాడ, సోంపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలను ఎంఇఒ పి.బాలభాస్కరరావు సందర్శించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బిపిఎ రాజు, ఎస్ఎస్ వల్లి, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

ఆ భూమి తప్ప ఏ భూమైనా ఇవ్వండి

తహశీల్దార్‌కు మొరపెట్టుకున్న పెదనడిపల్లి గ్రామస్తులు

ప్రజాశక్తి చీపురుపల్లి

తమ గ్రామానికి ఆనుకొని ఉన్న సర్వే నెంబర్ 78లో గల భూమి తప్ప వేరే ఎక్కడైనా సదరు ఆర్మీ ఉద్యోగి కుటుంబానికి భూమి ఇవ్వాల్సిందిగా పెదనడిపల్లి గ్రామానికి చెందిన ప్రజలు తహశీల్దార్‌కు శనివారం మొరపెట్టుకున్నారు. మండలంలోని పెద్ద నడిపల్లి గ్రామంలో సర్వే నెంబర్ 78లో గల భూమిని అదే మండలంలో పర్ల గ్రామానికి చెందిన ఇటీవలే మృతి చెందిన ఒక ఆర్మీ ఉద్యోగి కుటుంబానికి ప్రభుత్వం కేటాయించింది. అయితే సదరు భూమి తమ గ్రామానికి ఆనుకొని ఉండటంతో పాటు అక్కడ కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు, కొంతమంది పేదలకు పట్టాలు కూడా ఇచ్చి ఉన్నారని, అటువంటి భూమిని ఆర్మీ కుటుంబానికి ఎలా కేటాయిస్తారని తహశీల్దార్‌కు వివరించారు. తమ గ్రామంలో ఇంకా చాలామంది పేద ప్రజలు ఉన్నారని వారికి ఆ స్థలంలో ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని, చాలామంది ఇప్పటికే సంబంధిత రెవెన్యూ శాఖ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఆ భూమి తప్ప తమ రెవెన్యూ పరిధి అయిన భూలోకపతి వరకట్టు ప్రాంతంలో చాలా భూములు ఖాళీగా ఉన్నాయని అటువంటి ప్రదేశంలో ఆర్మీ ఉద్యోగి కుటుంబానికి ఎక్కడ భూమి ఇచ్చినా తమకు అభ్యంతరం లేదని తహశీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఈ విషయమై జిల్లా కలెక్టర్, డిఆర్‌ఒకి వినతి పత్రాలు కూడా ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు, మాజీ సర్పంచ్, ఎంపిటిసితో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.



తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న పెదనడిపల్లి గ్రామస్తులు

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-బొబ్బిలి

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సిఐ పి.చిన్నంనాయుడు తెలిపారు. రామభద్రపురం మండలం పాడివానివలసలో శనివారం బెల్ట్ షాపుపై దాడి చేసి 13 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. బెల్టుషాపు నిర్వాహకుడిని అరెస్టు చేశారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని సిఐ హెచ్చరించారు. బెల్ట్‌షాపులపై సమాచారం ఇవ్వాలని కోరారు.



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

ప్రజాశక్తి- రాజాం

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. స్థానిక డోలాపేటలో గల టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ ప్రజల నుంచి శనివారం వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లు, కాలువల నిర్మాణం వంటి కనీస వసతులపై అధికంగా విజ్ఞప్తులు వస్తున్నాయని, గత వైసిపి ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో కనీస వసతులను కల్పించడంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. నియోజకవర్గానికి సంభందించి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, స్టేడియం, పీజీ సెంటర్ ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టిలో పెట్టామని త్వరలో ఇవి రానున్నాయని తెలిపారు.ఇప్పటికే మంజూరైన పాలిటెక్నిక్ కళాశాల వచ్చే ఏడాది ప్రారంభం కానుందని తెలిపారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి వివిధ ఆసుపత్రిలో చికిత్స పొందిన రేగిడి మండలం బూరాడ గ్రామానికి చెందిన చెబిలోలు రాజేష్‌కు సిఎం సహాయనిధి ద్వారా రూ.3.39లక్షల చెక్కును అందజేశారు. నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యం, విద్యపై శ్రద్ధ వహించాలి

బాలల హక్కుల రాష్ట్ర కమిషన్ సభ్యులు బి.పద్మావతి



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న పద్మావతి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

పిల్లల హక్కులు, విద్య, ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని బాలల హక్కుల రాష్ట్ర కమిషన్ సభ్యులు బి.పద్మావతి సూచించారు. ఆమె స్థానిక కెజిబివి బాలికల విద్యాలయాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థుల హెల్త్, స్టడీ, ఎడ్యుకేషన్ అంశాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం పై శ్రద్ధ తీసుకొని ఎటువంటి అనారోగ్యం కలగకుండా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా నాణ్యతతో కూడిన భోజనం విద్యార్థులకు అందించాలని, వారి హక్కులకు భంగం వాటిల్లకుండా విద్యపై ముందుకు సాగడానికి సహకరించాలని సూచించారు. రాబోయే పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించడానికి ఉపాధ్యాయులు, సిబ్బంది కృషి చేయాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో ఆమె వెంట డిఇఒ ఆర్. మాణిక్యం నాయుడు, ఎపిసి డాక్టర్ రామారావు, ప్రిన్సిపాల్ బి.ఉమా ఉన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే మాధవి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-భోగాపురం, పూసపాటిరేగ, డెంకాడ

నెల్లిమర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే లోకం నాగ మాధవి పుట్టినరోజు వేడుకలు భోగాపురం, పూసపాటిరేగ, డెంకాడ, నెల్లిమర్ల మండలాల్లో శనివారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. భోగాపురంలో జనసేన నాయకులు కాకర్లపూడి శ్రీనివాసరాజు ఆధ్వర్యాన పార్టీ కార్యాలయంలో కేకును కట్ చేశారు. రావాడ గ్రామంలో మండల పార్టీ అధ్యక్షులు వందనాల రమణ, రావాడ జనసేన నాయకులు కొండపు రాధాకృష్ణారెడ్డి, రావాడ జనసేన నాయకులు సమక్షంలో మెగా ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహించారు. హెల్త్ క్యాంపులో 225 మందికి వైద్య పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. 25 మంది జనసేన నాయకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు పడాల శ్రీనివాసరావు, మాతా నవీన్, లంక సత్యనారాయణ, బొల్లు త్రినాథ్ , మైలపల్లి అప్పలకొండ, సీతం నాయుడు , గుండు దిలీప్ ,దల్లి శ్రీను, కొండపు రమణ, కొయ్యరాంబాబు తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ మండలంలో జనసేన నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపిపి బంటుపల్లి వెంకట్ వాసుదేవరావు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. పినతాడివాడకు చెందిన జనసేన సీనియర్ నాయకులు మహంతి శివకుమార్ గ్రామంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాలకు, ఒమ్మి పేట అంగన్వాడి కేంద్రాల్లో చదువుతున్న పిల్లలకు పదివేలు విలువైన పలకలు, పెన్సిలళ్లు, వాల్‌చార్టులు, భోజనం ప్లేట్లు అందజేశారు.



భోగాపురంలో జనసేన నాయకులు శ్రీనివాసరాజుకు కేక్ తినిపిస్తున్న నాయకులు



డెంకాడ : పినతాడివాడలో చిన్నారులకు పుస్తకాలు అందజేస్తున్న మహంతి శివకుమార్



ప్రజాశక్తి ముద్రించిన ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మాధవి,జనసేన నాయకులు

గుణుపూర్‌పేటలో జనసేన మండల కోఆర్డినేటర్ పైల శంకర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి రామాలయంలో పూజలు నిర్వహించారు. జొన్నాడలో జనసేన సీనియర్ నాయకుడు దిండి రామారావు ఆధ్వర్యంలో పలువురు వృద్ధులకు, పేదలకు పల్లు, బట్టలు పంపిణీ చేశారు. అక్కివరంలో జనసేన సీనియర్ నాయకులు, మాజీ జెడ్‌పిటిసి కంది సూర్యనారాయణ, సర్పంచ్ కంది కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

పూసపాటిరేగ: ఎమ్మెల్యే లోకం నాగమాధవి పుట్టిన రోజు సందర్భంగా ప్రజాశక్తి దినపత్రిక ముద్రించిన ప్రత్యేక సంచికను ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో పూసపాటిరేగ మండల జనసేన నాయకులు పతివాడ శ్రీను, బాలా అప్పలరాజు, కోట్ల రఘు, వందనాల అప్పలరాజు, జలపారి శ్రీనువాసరావు, భోగాపురం నాయకులు అయ్యప్పరెడ్డి, చెల్లుబోయిన నర్సింగరావు, టిడిపి నాయకులు ఇజ్జురౌతు ఈశ్వర్రావు, ప్రజాశక్తి సిబ్బంది పాల్గొన్నారు.

కొవ్వాడలో సర్పంచ్ కోట్ల రఘు, గోవిందపురంలో బాలా అప్పలరాజు, కందివలసలో నాక్కన రమణ, కోనాడలో ఇజ్జుపు కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరిగాయి. మండల జనసేన కోఆర్డినేటర్ జమరాజు ఆధ్వర్యంలో కోనాడ జంక్షన్‌లో గల క్యాంపస్ చాలెంజ్‌లో మూగ, చెవిటి పిల్లల మధ్య కేక్ కట్ చేశారు.